క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చిన్నకంబలూరులో కార్డెన్ సెర్చ్



గడ్డివామిలో సోదా చేస్తున్న పోలీసులు

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరులో ఆదివారం తెల్లవారు జామున శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్నపీరయ్య యాదవ్ పోలీస్ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానిత నాయకుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అయితే ఎక్కడా ఎలాంటి అనుమానిత వస్తు సామగ్రి లభించలేదని వారు తెలిపారు. అలాగే అటువైపు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేయగా.. సరైన ధ్రువ పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 మోటర్ సైకిళ్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

ఆవోపా ద్వారా వడ్డీ లేని రుణాలు



రుణాలను పంపిణీ చేస్తున్న ఆవోపా సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో ఆవోపా సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. అధ్యక్షుడు సముద్రాల మధుసూదన రావు మాట్లాడుతూ 10 మందికి రూ.50 వేల ప్రకారం వడ్డీ లేని రుణాలు అందజేశామన్నారు. అలాగే నలుగురికీ వృద్ధాప్య పింఛన్లను పంపిణీ చేశారు. ఆవోపా గౌరవ అధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి, కోశాధికారి కాల్వ సురేష్, చెంచయ్య పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పేదవారి ఆకలి, సహనం రంజాన్ పరమార్థం అని జమా అతె ఇస్లామీ నంద్యాల అధ్యక్షుడు సమద్ పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పేద ముస్లింలకు దాతల సహకారంతో ఆదివారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రూ.వెయ్యి విలువ గల ఆహార పదార్థాలను 300 మందికి అందజేశారు. దాత గోల్డెన్ బేకరి అధినేత అఫ్రోజ్‌ను అభినందించారు. జిక్రియ అబ్దుల్ ఖాదర్ జీలాని, పి.వి.ముస్తఫా, ఫయాజ్, అబ్దుల్ అలీం పాల్గొన్నారు.

దుకాణాల అద్దె తగ్గించాలి



నిరసన తెలుపుతున్న రెడీమేడ్ షాపుల యజమానులు

నంద్యాల(అర్బన్): రెడీమేడ్ షాపుల అద్దెలు తగ్గించి వ్యాపారులను ఆదుకోవాలని రెడీమేడ్ షాపుల యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహరాజు, కార్యదర్శి శేఖరప్ప కోరారు. షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ వ్యాపారాల వల్ల రెడీమేడ్ వ్యాపారాలు దెబ్బ తిన్నాయని, షాపుల అద్దెలు కూడా చెల్లించే పరిస్థితి తలెత్తిందని వాపోయారు. ఆదివారం పట్టణంలోని కల్పనా సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించి వారు మాట్లాడుతూ రెడీమేడ్ షాపుల యజమానుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి షాపుల అద్దెలు తగ్గించేలా యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. అద్దెలు చెల్లించలేక ఇప్పటికే 40 నుంచి 50 రెడీమేడ్ షాపులు మూతపడ్డాయని, మరి కొన్ని మూతపడే దశలో ఉన్నాయని, భవన యజమానులు అద్దెలు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు వెంకటేష్, జోరావర్‌సింగ్, వినయ్, సత్యంరెడ్డి, ఆదినారాయణ, రియాజ్ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించక..

పనులు పూర్తికాక!

- కొండుపల్లె – ఉయ్యాలవాడ తారురోడ్డు నిర్మాణానికి రూ. 9.50 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించని కూటమి సర్కారు
- మధ్యలోనే నిలిచిపోయిన పనులు
- రహదారి కష్టాలు ఎదుర్కొంటున్న మూడు గ్రామాల ప్రజలు



రోడ్డుకు కంకరవేసి వదిలేసిన దృశ్యం

ఉయ్యాలవాడ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలోని కొండుపల్లె నుంచి ఉయ్యాలవాడకు నూతనంగా తారు రోడ్డు నిర్మాణానికి రూ. 9.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ 2023 నవంబర్‌లో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడం, చేసిన పనులకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో రహదారి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో మూడు గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తప్పడం లేదు.

మట్టి, కంకర పరుపు పనులు పూర్తి..

కొండుపల్లె – ఉయ్యాలవాడ రహదారిలో 6 కిలో మీటర్ల పొడవున తారు రోడ్డుతో పాటు రహదారిలో 7 కల్వర్టులు, 150 మీటర్ల పొడవున రక్షణ గోడలు, 350 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయవలసి వుంది. రహదారిలో మట్టి విస్తరణ పనులు, కంకర పరుపు పనులు పూర్తయ్యాయి. పనులు సాగుతున్న దశలో ప్రభుత్వం మారింది. దీంతో అప్పటి నుంచి రహదారి నిర్మాణం పనులు ముందుకు సాగడంలేదు. చేసిన పని వరకు బిల్లు మంజూరు కాకపోవడంతో మిగిలిన పనిని పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. దీంతో నిర్మాణం పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయి ఉయ్యాలవాడ, కొండుపల్లె, ఇంజేడు గ్రామాల ప్రజలు, పంట పొలాలకు వెళ్లే రైతులు నిత్యం పంట ఉత్పత్తులను తరలించేందుకు కష్టాలు ఎదుర్కొంటున్నారు.

రహదారిపై కష్టాలు పడుతున్నాం



చిన్నపాటి వర్షం వచ్చినా పంట పొలాల్లోని దిగుబడులను గృహాలకు తరలించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రహదారి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేస్తే కష్టాలు తొలుగుతాయి.

– అంబటి తులసిరెడ్డి, కొండుపల్లె

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి



కొండుపల్లె, ఉయ్యాలవాడ రహదారిలో అర్ధంతరంగా నిలిచిపోయిన నూతన రహదారి నిర్మాణంపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తయితే మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించుకునేందుకు సులభతరంగా వుంటుంది. రైతుల కష్టాలు కూడా తీరుతాయి.

– లక్ష్మీనారాయణరెడ్డి, ఇంజేడు

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

కాంట్రాక్టర్ చేసిన పనులకు సంబంధించి రూ. 1.10 కోట్ల మేరకు కొలతలు వేసి ఎంబుక్ రికార్డు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. త్వరలో బిల్లులు మంజూరు అయ్యే అవకాశం వుంది. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణం పనులు కొనసాగించేలా చర్యలు తీసుకుంటాం.

– కొండారెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

అరెస్ట్ సరికాదు

నంద్యాల(న్యూటౌన్): ఎల్‌జీ పాలిమర్ కేసుకు సంబంధించిన బాధితుల తరపున పోరాడినందుకు అక్రమ కేసు పెట్టి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తిని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని, సహజ వనరులను దోపిడీ చేస్తున్న నాయకులు బహిరంగంగా తిరుగుతున్నా పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం.. ప్రజల కోసం పోరాడుతున్న నాయకులను అరెస్ట్ చేయడం అమానుషమన్నారు. సత్యనారాయణమూర్తిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అగ్నిప్రమాదంలో పూల అంగళ్లు దగ్ధం

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని పాత బస్టాండులో శనివారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదుగురు వ్యాపారులకు చెందిన పూల అంగళ్లు మంటల్లో కాలి దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు షాషా, హుసేన్‌వలి, పూల ఇంమాంహుసేన్, షరీఫ్ తెలిపారు. దాదాపు 80 ఏళ్ల నుంచి పాత బస్టాండులోని గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలంలో గ్రామానికి చెందిన కొంత మంది పూల అంగళ్లు నిర్వహించుకుంటున్నారు. అయితే ఈ అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా? లేక లేక ఏవరైనా ఉద్దేశ పూర్వకంగా చేశారా అని గ్రామస్తుల్లో అనుమానం వ్యక్తమవుతోంది.



చాగలమర్రి పాత బస్టాండులో అగ్నిప్రమాదంలో దగ్ధమైన పూల దుకాణాలు

పెద్దబోధనంలో చోరీ

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం గ్రామంలో శనివారం రాత్రి కోకిల ఓబులేసు అనే వ్యక్తి ఇంట్లో దొంగలు తాళాలు పగుల గోట్టి బీరువాలో ఉన్న రూ.2 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, కొంత నగదును అపహరణకు గురయ్యాయి. బాధితుడు చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇన్‌చార్జ్ ఎస్ఐ హరి ప్రసాద్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. విచారణలో భాగంగా ఆదివారం క్లూస్ టీంతో పెద్దబోధనం గ్రామానికి చేరుకొని సిబ్బందితో విచారణ చేపట్టి, ఇంటి తలుపుపై, బీరువా, తదితర వస్తువులపై ఉన్న వేలి ముద్రలను సేకరించారు. బాధితులు తెలిపిన వివిరాల మేరకు వివరాలు.. శుక్రవారం ఇంటికి తాళం వేసి ఓబులేసు అతని భార్య నాగమ్మతో కలిసి జమ్మలమడుగులో ఉన్న తన బిడ్డ ఇంటికి వెళ్లి ఆదివారం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటికి వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉండగా.. లోపలికి వెళ్లి చూడగా బీరువా కూడా పగుల గోట్టి ఉంది. వెళ్లి పరిశీలించగా అందులో ఉన్న బంగారు వస్తువులు చోరికి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా స్థానిక పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత కారణంగా మండలంలో అసాంఘిక శక్తులు పెట్రేగిపోతున్నాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడివున్న దృశ్యం

కొత్తూరులో ప్రముఖుల పూజలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పలువురు పోలీసు అధికారులు పూజలు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి, గుంటూరు జిల్లా అడిసినల్ ఎస్పీ వర్థారెడ్డికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వారు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారి చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రపాదాలు అందించారు.



విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు, అధికారులు

రైతు బిడ్డకు ఎస్ఐ ఉద్యోగం

వెలుగోడు: రైతు కుటుంబంలో జన్మించిన మాధవరం యువకుడు సతీష్ సబ్‌ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)గా ఉద్యోగం సాధించారు. మండల పరిధిలో ని మాధవరం గ్రామానికి చెందిన రైతు మద్దెల సంజీవకుమార్ వ్యవసాయం కలిసి రాకపోయినా తన కుమారుడు సతీష్‌ను బాగా చదివించాడు. తండ్రి కలలను నిజం చేస్తూ సతీస్ అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకొని, సత్యసాయి జిల్లాలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. దీంతో గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు సతీష్‌ను అభినందించారు.



ఎస్ఐగా ఎంపికైన సతీష్

విద్య ప్రైవేటీకరణను ప్రోత్సహించడమే బడ్జెట్ ఉద్దేశం

నంద్యాల(న్యూటౌన్): విద్య వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ ప్రోత్సహించేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 20 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 35 శాతం, జీడీపీలో ఆరు శాతం నిధులు కేటాయించాలన్నారు. విద్యారంగానికి తక్కువ బడ్జెట్ కేటాయించి ఆర్భాటాలు చేసుకొనే పద్ధతి మానుకోవాలన్నారు. ఎన్‌డీపీ ప్రభుత్వం 9 నెలల కాలంలో రెండోసారి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

మహానందీశుడి దంపతులకు ఏకాంతసేవ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు ఆదివారం రాత్రి ఏకాంతసే పూజలు నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు శాంతారాంభట్ స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా ఏకాంతసేవ పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయ గోపురం నుంచి పడి వ్యక్తికి గాయాలు

బనగానపల్లె రూరల్: యాగంటి ఆలయ గోపురంపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగిస్తుండగా ప్రమాదశాత్తు కిందపడి నరేంద్ర అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ గోపురానికి విద్యుత్ లైట్లు వేశారు. ఆదివారం సాయంత్రం అవి తీసేందుకు చాగలమర్రి మండలం బోధనం గ్రామానికి చెందిన నరేంద్ర గోపురంపైకి ఎక్కి వైర్లను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడ్డాడు. ఆలయ సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాలు, తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు వైద్యులు సిఫార్సు చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

బదిలీలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలి

నంద్యాల(న్యూటౌన్): బదిలీలు, పదోన్నతులు ఆన్‌లైన్ విధానంలో కాకుండా మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బదిలీల చట్టంలోని పనితీరు, పాయింట్లను తొలగించి సర్వీసు స్టేషన్ పాయింట్లను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్నారు. బదిలీలు, పదోన్నతుల్లో ఖాళీగా ఉన్న స్థానాలను బ్లాక్ చేయకుండా అన్నింటిని చూపించాలని కోరారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కాకుండా యూనియన్ బాధ్యతలకు నూతన జిల్లాల ప్రాతిపదికన బదిలీలో పాయింట్లు కల్పించాలన్నారు. జీరో సర్వీసు కలిగిన ఉపాధ్యాయులకు కూడా బదిలీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు జాకీర్‌హుసేన్, వీరేశ్వరరెడ్డి, రాజేష్, ఇద్రూష్‌బాషా, మల్లికార్జున రావు, పుల్లయ్య, మధు, దస్తగిరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాకీర్‌హుసేన్

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



మహానందీశుని భక్తులకు పార్కింగ్ కష్టాలు

- ఆలయం ఎదుటే వాహనాల నిలిపివేత

మహానంది: మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. ఏడాదికి రూ.కోట్లలో ఆదాయం వస్తుంది. దీనికి తోడు మహానందీశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే కార్లు, జీపులు, లారీలు, బస్సులు, ఇతర వాహనాల నుంచి టోల్ గేటు రుసుము వసూలు చేస్తున్నారు. అయినా ఆలయం వద్దకు వచ్చేసరికి పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి ఇరువైపులా ఉన్న మాడవీధుల్లోనూ, మహాద్వారం వద్ద నిలుపుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఆలయానికి అడ్డంగా వాహనాలు ఉండటంతో సాధారణ భక్తులకు ఇబ్బందికరంగా మారుతోంది. రూ.300 కోట్లతో మాస్టర్‌ప్లాన్ అంటూ గొప్పలు చెప్పుకునే ప్రజాప్రతినిధులు, అధికారులు పార్కింగ్ వసతి కల్పించాలని పలు ప్రాంతాల భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆలయం ఎదురుగా నిలిపిన భక్తుల కార్లు

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహాశిరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు 22 ఎద్దుల జతలు పాల్గొన్నాయి. పోటీలను టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ ప్రారంభించారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.1.50 లక్షలు, రూ.1.30 లక్షలు, రూ.1.10 లక్షలు, రూ.90 వేలు, రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు.



బండ లాగుతున్న ఎద్దులు

ఆహార సలహా సంఘాలు ఏమైనట్టు?

- నేటి వరకు సంఘాలను ఏర్పాటు చేయని వైనం
- రేషన్ పంపిణీపై కొరవడిన పర్యవేక్షణ
- సమస్యలతో సతమతమవుతున్న రేషన్‌కార్డు దారులు
- పట్టించుకోని అధికారులు



నంద్యాల తహసీల్దార్ కార్యాలయం

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో 1,204 రేషన్ షాపులు, 5.41 లక్షల మంది కార్డుదారులు ఉన్నారు. ప్రతి మూడు మాసాలకోసారి మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఆహార సలహా సంఘాల సమావేశం నిర్వహించాల్సి ఉంది. సంఘం చైర్మన్‌గా సబ్ కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా తహసీల్దార్, సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యాయులు సమావేశంలో పాల్గొనాల్సి ఉంది. ఆహార సలహా కమిటీకి రేషన్ షాపుల తనిఖీలు, బియ్యం సరఫరాపై నిఘా, తూనికలు–కొలతలపై పర్యవేక్షణ అధికారాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేకపోవడంతో రేషన్ డీలర్లదే ఇష్టారాజ్యమైంది. చౌక దుకాణాల్లో ఇచ్చే సరకుల నాణ్యతను పట్టించుకునేవారు కరువయ్యారు. రేషన్ షాపుల్లో నిత్యావసర సరకుల పంపిణీలో చోటుచేసుకుంటున్న సమస్యలపై పలుమార్లు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోంది. షాపుల ద్వారా సకాలంలో సరకులు పంపిణీ చేయడం లేదని, కొలతల్లో తేడాలు చోటు చేసుకుంటున్నాయని, సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో వారి చుట్టూ ప్రదక్షిణలు చేయించు కుంటున్నారని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే సరుకులు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు రేషన్ కోసం చౌకదుకాణాలకు వెళ్లి గంటల తరబడి నిరీక్షించే అగత్యం లేకుండా ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి నిత్యావసర సరకులు పంపిణీ చేసే వారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరకులు సరఫరా చేసే వాహనాలను పలు ప్రాంతాల్లో నిలిపివేసి తమ ఇష్టమొచ్చినట్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కార్డుదారులు వాపోతున్నారు. వికలాంగులు, వృద్ధులు రేషన్ దుకాణాలకు వెళ్లి క్యూలో నిల్చుని, అవస్థలు పడి, సరకులు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అయితే కార్డుదారుల తరఫున, వారి సమస్యల పరిష్కారానికి ఆహార సలహా సంఘాలు పోరాడేవని, ప్రస్తుతం సంఘాల ఊసే లేకోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి సమావేశాలను నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

జాడలేని సంఘాలు

గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాప్‌లో చోటు చేసుకుంటున్న లోటుపాట్ల గురించి సమావేశాల్లో సంబంధిత అధికారుల దృష్టికి సంఘ సభ్యులు తీసుకువచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఘాల ఉనికే లేకుండా పోయింది. ఉన్నాయో.. లేవో కూడా తెలియని పరిస్థితి. వీటి ఏర్పాటును సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. డీలర్ల సమావేశంతో మమ అనిపిస్తున్నారు.

– ప్రభాకర్, మాజీ ఎంపీపీ, పోలూరు, నంద్యాల

చర్యలు తీసుకుంటాం

మండలంలో ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రేషన్ సరకుల పంపిణీలో చోటు చేసుకుంటున్న సమస్యలపై తనకు సమాచారమిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తా. త్వరలోనే ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసి సమావేశం నిర్వహిస్తాం. రేషన్ పంపిణీలో నెలకొన్న సమస్యల గురించి చర్చిస్తాం.

– ప్రియదర్శిని, తహసీల్దార్, నంద్యాల

ఘనంగా గురుకులం వార్షికోత్సవం



పిరమిడ్ విన్యాసం చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని గోకవరం గ్రామంలో ఉన్న భక్తకన్నప్ప గురుకులం ఆవాస వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్, ఆవాస కమిటీ అధ్యక్షులు కోట్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి రఘురాములు పాల్గొన్నారు. విద్యార్థుల కోలాటం, భజన, సూర్య నమస్కార పిరమిడ్లు అలరించాయి. దేశభక్తి పాటల ద్వారా, స్వామి వివేకానంద ఏకపాత్రాభినయం ద్వారా, ఆదర్శ గ్రామం యోజనలో భాగంగా వివిధ నాటకాలు ప్రదర్శించారు.